నత్తనడకన క్రమబద్ధీకరణ!

- జీఓ.59 ప్రకారం వాయిదాల చెల్లింపుకై అధికారుల వినతి
- మార్కెట్ వాల్యూ ఎక్కువ నిర్ణయించారని అంటున్న దరఖాస్తుదారులు
- వాయిదాల చెల్లింపులో జాప్యంపై ఉన్నతాధికారుల ఆగ్రహం



కూకట్‌పల్లి మండల కార్యాలయం

కేపీహెచ్‌బీకాలనీ: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ నత్తనడకన సాగుతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి మండలంలో ప్రభుత్వ స్థలాల్లో వెలసిన ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. అందులో ఉచితంగా క్రమబద్ధీకరించే స్థలాలకు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి.

- ఉచితంగా క్రమద్ధీకరించాల్సిన ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంటే... డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకునే ఇళ్ల స్థలాల విషయంలో దరఖాస్తుదారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- డబ్బులు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సిన దరఖాస్తుల విషయంలో మాత్రం క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ద్వారా ప్రభుత్వానికి పెద్దమొత్తంలో డబ్బులు సమకూరుతాయని ఆశించినప్పటికీ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా మారింది.

జీఓ.58 ప్రకారం..

125 చ.గలోపు ఉచితం

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జీఓ.58 ప్రకారం 125 చదరపు గజాల లోపు ఉచితంగా క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంది. ఇప్పటికే జీఓ.58 ప్రకారం ఉచితంగా క్రమబద్ధీకరించాల్సిన సుమారు 4వేల దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన మండల రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికను సైతం సమర్పించారు.

- ఎలాంటి వివాదాలు లేని ప్రభుత్వ భూముల్లో అర్హత కలిగిన 125 చదరపు గజాలలోపు స్థలాలకు క్రమబద్ధీకరణకు రంగం సిద్ధం చేశారు. ఉచితంగా జరిగే ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ త్వరలోనే పూర్తికానున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

జీఓ.59 ప్రకారం..

125 చ.గ కంటే ఎక్కువ ఉంటే డబ్బులు

125 చదరపు గజాలకు మించి ఉన్న ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం జారీ చేసిన జీఓ.59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారి విషయంలో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. స్థలాల విస్తీర్ణాన్ని బట్టి మార్కెట్ ధరల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన మేరకు డబ్బులు చెల్లించేందుకు విముఖత చూపుతున్నారు.


- జీఓ. 59 ప్రకారం వచ్చిన 2680 దరఖాస్తుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగినవి కేవలం 415గా తేల్చారు. అందులోనూ ప్రభుత్వ రెవెన్యూశాఖ మినహా ఇతర శాఖలతో నెలకొన్న వివాదాల నేపథ్యంలో సాయినగర్‌కు చెందిన 59 దరఖాస్తులను తీసివేశారు. 346 దరఖాస్తులను అర్హత కలిగినవిగా పరిగణించి మూడు వాయిదాలలో డబ్బులు చెల్లించాలని దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేశారు.

ఆశించిన మేరకు స్పందన కరువు..

ఇప్పటికే మొదటి వాయిదా డబ్బులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ దరఖాస్తుదారుల నుంచి ఆశించిన మేరకు స్పందన లేకపోవడంపై అధికారులు ఆందోళన గురవుతున్నారు. డబ్బులు చెల్లించాలని డిమాండ్ నోటీసులు జారీ చేసిన అధికారులకు మార్కెట్ వాల్యూ ధరలు ఎక్కువగా నిర్ణయించార... లక్షలాది రూపాయలు చెల్లించడం కష్టతరంగా మారిందనే అభిప్రాయాలు దరఖాస్తుదారుల నుంచి వినిపించాయి.

- నేరుగా దరఖాస్తుదారులకు ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని కోరిన రెవెన్యూ అధికారులకు ఆశించిన మేరకు స్పందన రాలేదు. ఒక వైపు ఉన్నతాధికారుల ఒత్తిళ్లు, మరోవైపు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల నుంచి విముఖత వ్యక్తం కావడంతో మండల రెవెన్యూ అధికారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

డబ్బులు చెల్లిస్తేనే క్రమబద్ధీకరణ...



జీఓ.59 ప్రకారం నిర్దేశిత డబ్బులు చెల్లించిన వారికి మాత్రమే ప్రభుత్వం పేరిట ఉన్న ఇళ్ల స్థలాలను దరఖాస్తుదారుల పేరిట క్రమబద్ధీకరిస్తాం. జీఓలో పేర్కొన్న మేరకు మాత్రమే మార్కెట్ వాల్యూ ఆధారంగా చెల్లించాల్సిన వాయిదా డబ్బులను నిర్ణయించాం. దరఖాస్తుదారులు పొందుపర్చిన వివరాలు, క్షేత్రస్థాయిలో అధికారులు నిర్వహించిన సర్వే సందర్భంగా వెలుగుచూసిన వాస్తవాలను సరిచూసుకొని నిబంధనలకు అనుగుణంగా చెల్లించాల్సిన డబ్బులను నిర్ణయించాం. ఏవైనా అనుమానాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు. గడువు లోపు వాయిదాలను ప్రభుత్వ మీసేవా కేంద్రాలలో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

– గోవర్ధన్, కూకట్‌పల్లి మండల తహసీల్దార్

బహుజన మేధావులపై దాడిని ఖండిస్తున్నాం

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ

కూకట్‌పల్లి: మనుస్మృతికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని రక్షించే క్రమంలో ఆదివారం ఏజీ కార్యాలయంలో జరిగిన కాకర్యక్రమంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్ సతీష్ చందర్, ప్రజాకవి జయరాజ్, డీఐఎఫ్ నాయకులు, ఇతర ఎస్సీ సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి రాత్రి వరకు ముషీర్‌బాగ్ ఇతర పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం రార్యాంగ విరుద్ధమైన చర్య అని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ పేర్కొన్నారు. దీనిపై బీజేపీ నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్ లాంటి దేశ ద్రోహులపై రాజద్రోహం కేసు పెట్టాలని మాల మహానాడు డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఇన్‌చార్జి ప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యదర్శి బిల్లం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



మూసాపేట: మూసాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చెరుకు కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ కుమారస్వామి, మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పల చంద్రశేఖర్, అన్నదాన చైర్మన్ నేతి రాములు, కమిటీ మెంబర్లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి నెలా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

22న జాబ్ ఫెయిర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 22వ తేదీన డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) జాబ్ ఫెయిర్–23 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌ఫెయిర్‌లో హెచ్‌సీఎల్, విప్రో, రిలయన్స్, మహింద్రా ఫైనాన్స్, బైజూస్, యాక్ట్ ఫైబర్‌నెట్, ఎస్‌బీఐ కార్డు, జస్ట్ డయల్, ఐమాక్స్, ఫర్నిచర్ వరల్డ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు రిజిస్ట్రేషన్ కొరకు htt p:// bit. y/DE-E-T-J-O-B-F-A-I-Q2 సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ ఉండదని భాగ్యనగర్ విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. వెస్టన్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అడ్డగుట్ట ప్రాంతంలో.. అదేవిధంగా వినాయకనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

26న దళితుల ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ సమావేశం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సర్కిల్ దళితుల ఐక్యవేదిక సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు బోడ నర్సింగ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్ హౌసింగ్‌బోర్డుకాలనీ కమ్యూనిటీహాలులో సాయంత్రం 4గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సెంట్రల్ కమిటీ, డివిజన్ కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీని ఎన్నుకునే విషయం గురించి చర్చిస్తామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం




ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ ఈస్ట్ సాయినగర్‌లోని శ్రీసాయిబాబా మందిరం 26వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయలంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వరాత్మక సంకీర్తనా విభావరి గాయని లక్ష్మీహారతి బృందం భక్తి గీతాలు ఆలపించారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం, సాయంత్రం బాబా పల్లకి సేవ నిర్వహించారు. వార్షికోత్సవంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిల్ రాజు, ప్రధాన కార్యదర్శి లంగాటి నరేందర్‌రెడ్డి, కార్యదర్శులు సురభి రమేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో కబ్జారాయుళ్లు రెచ్చిపోయారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వేనం.329/1 ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టారని విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సిబ్బంది మూడు గదులను నాలుగు బేస్‌మెంట్లను నేలమట్టం చేశారు.

కూరగాయల మార్కెట్‌లో అమావాస్య పూజలు



అన్నదానం చేస్తున్న మక్కాల సత్యనారాయణ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కనకదుర్గ ఆలయంలో ప్రతి అమావాస్యకు అన్నదానం చేసేందుకు తగిన సహాయ సహకారాలు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలకు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. రిటైల్ కూరగాయల మార్కెట్ అధ్యక్షుడు మక్కాల అశోక్, వైస్ చైర్మన్ రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్, కార్యదర్శి మక్కాల నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ

కుత్బుల్లాపూర్: నందమూరి తారకరత్న మృతిని చింతిస్తూ సోమవారం కుత్బుల్లాపూర్ కమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి కమ్మసేవా సమితి సభ్యులు హాజరై తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తారకరత్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించామన్నారు.

సీఎం కేసీఆర్ మోసాలను ప్రజలకు వివరిస్తున్నాం

ప్రజా గోస – బీజేపీ భరోసాలో మొవ్వా సత్యనారాయణ



విజయ్‌నగర్‌కాలనీలో జరిగిన కార్యక్రమంలో మొవ్వా సత్యనారాయణ, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజాగోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయ్‌నగర్‌కాలనీలో జిల్లా సెక్రటరీ విజిత్‌వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా బీజేపీ రాష్ట్ర నాయకులు మొవ్వా సత్యనారాయణ విచ్చేసి మాట్లాడుతూ.. కాలనీలో మురుగునీటి ప్రవాహంతో దుర్వాసన, మరుగుదొడ్లు, గ్రౌండ్ వాటర్, అస్తవ్యస్తమైన రోడ్లు ఇవేమీ సరిగ్గా లేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. కనీసం పేదలు ఉండడానికి కూడా చోటు లేకుండా కబ్జాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

- నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారతదేశాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఉద్యమకారులను వాడుకొని లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఇప్పుడు దేశాన్ని దోచుకోవడానికి బీఆర్ఎస్ పార్టీగా పేరు మార్చారని విమర్శించారు. ముఖ్యమంత్రి మోసాలు, మాయమాటలు, ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడానికి ప్రజాగోస –బీజేపీభరోసా కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ విజిత్ వర్మ, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ సాహిత్ వర్మ, బూత్ అధ్యక్షులు వేణు, మధు, చందు, అశోక్, కృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళా నీరాజనం



పద్మకళ్యాణ్‌ను సన్మానిస్తున్న ఎస్‌వీఎస్ కళానికేతన్ నిర్వాహకులు

మూసాపేట: శివరాత్రి సందర్భంగా భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో కూచిపూడి నాట్య గురు హేమ వనసర్ల శిష్యబృందం సోమవారం ఘనంగా కళానీరాజనం అర్పించారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్యం, శాస్త్రీయ సంగీతంతో పాటు సెమీ క్లాసికల్ నృత్యం కూడా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పద్మకళ్యాణ్, లక్ష్మణ్, రాణి సులోచన, వెంకటేశ్వరరావు, సుధీర, అనిల్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పద్మకళ్యాణ్‌ను ఎస్‌వీఎస్ కళానికేతన్ వారు కళాతపస్వి బిరుదు, జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమం అనంతరం నృత్యం ప్రదర్శించిన కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

కేంద్రం నిధులు రాష్ట్రానివంటూ తప్పుడు ప్రచారం

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం తమవిగా పేర్కొంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జాతీయ నాయకుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ శివాజీరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమానికి మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కొంపల్లి మున్సిపాలిటీలో జాతీయ రహదారికి 500 మీటర్ల లోపు ఉన్న కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఒక మున్సిపాలిటీలో సమస్యలు తీర్చలేని బీఆర్ఎస్ నాయకులు దేశంలోని సమస్యలు తీర్చడానికి బయలుదేరారని ఎద్దేవా చేశారు.

నిధులు కేటాయించినా తెచ్చుకోవడంలో విఫలం

- మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ... బోయిన్‌పల్లి నుంచి కాలాకల్ వరకు ట్రాఫిక్ సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం రూ.1500 కోట్ల నిధులతో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు చేపడుతుంటే రాష్ట్ర మంత్రులు ఇది తమ ఘనకార్యమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ పరిధిలో పన్నుల రూపేణా నిధులు వస్తున్నా స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ భాగంగా కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు కేటాయించినా వాటిని తెచ్చుకోవడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు.
- ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నరేందర్, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, రూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సరిత, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, శక్తి కేంద్రం సహా ఇన్‌చార్జ్ మాధురి, ఎన్‌సీఎల్, నోబెల్ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళినగర్‌లో మంజీరా వాటర్ సమస్యగా ఉందని... తాగునీరు తక్కువ ప్రెషర్‌తో వస్తోందని కాలనీ ప్రతినిధులు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి తెలిపారు. సమస్యను విన్న వెంటనే ఎమ్మెల్యే గాంధీ జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు దొడ్ల రామకృష్ణగౌడ్, నాయకులు కాశీనాథ్ యాదవ్, చాగంటి అశోక్, సైదులు, కృష్ణ, చంద్రశేఖర్, కోటిరెడ్డి, వెంకటేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ దృష్టికి పెండింగ్ సమస్యలు

బాలానగర్: జేపీఆర్ ద్వారకామాయి కాలనీ నూతన కమిటీ సభ్యులు సోమవారం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి కార్పొరేటర్ స్పందిస్తూ త్వరలో సంబంధిత అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి దశలవారీగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు, స్థానికులు కార్పొరేటర్ రవీందర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్.పి. పవిత్రన్, ఆర్. ఫణికుమార్, మొహమ్మద్ జాబేర్, పి. జోసెఫ్ కిరణ్, సన్నీ వర్గీస్, బి. కిషోర్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

నిజాంపేట్: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ డంపింగ్‌యార్డులో పరిశుభ్రత, ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, శానిటేషన్, పార్కు అభివృద్ధి, ఓపెన్ జిమ్, క్రీడా ప్రాంగాణాల అభివృద్ధి, వైకుంఠధామాల్లో మౌలిక సదుపాయాలపై ఆయా విభాగాల అధికారులతో చర్చించారు. అభివృద్ధి పనులకు సరిపడా నిధులు కేటాయించిన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు'

కుత్బుల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సూరారం డివిజన్‌లోని రామకృష్ణనగర్ చౌరస్తా, వేమారెడ్డినగర్, సోనియాగాంధీనగర్, హమీద్ బస్తీ, లక్ష్మినగర్, సూరారం గ్రామం, విశ్వకర్మ కాలనీల్లో సోమవారం హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టిన హన్మంతరెడ్డి స్థానికంగా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే పేద ప్రజలకు ఇవ్వకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ సాధనకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదు

నిజాంపేట్: బాచుపల్లి మండలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ... బాచుపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ సర్వే నం.86, 87, 90, 94, 95, 191, 233, 332, 364లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, కబ్జాలపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీంతో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు కరుమరుగవుతున్నాయని ఆరోపించారు. బాచుపల్లి మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ శ్రీనాథ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవిల వైఖరి కబ్జాదారులకు వత్తాసు పలికే విధంగా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వ భూములను సర్వే చేసి వాటిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

కార్డ్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఏవీబీ పురంలోని కార్డ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా వారికి వృత్తిపర కోర్సులు ఉచితంగా కల్పించడానికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్డ్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు సుమన్ 25 సంవత్సరాల నుంచి ఎంతో మంది అనాథ పిల్లలను ఆదుకుంటున్నారని అన్నారు. మహిళలకు ఉపాధి కల్పించి వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు పెద్ద సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కూడా పొందవచ్చన్నారు. ఈ వృత్తివిద్య కోర్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏవీబీ పురంలో అనేక మంది నిరుపేదలు ఉన్నారని అందుకే ఈ ప్రాంతంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తామని తెలిపారు. అదే విధంగా కరోనా వంటి కష్ట కాలంలో ఎంతో మంది నిరుపేదలకు నిత్యావసరాలను అందించి నిరుపేదలకు ఉపయోగపడుతున్నందుకు సంస్థ సభ్యుడు సుమన్ దంపతులను ఎమ్మెల్యే కృష్ణారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, సీనియర్ నాయకులు హరినాథ్, ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రం బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలం'

కూకట్‌పల్లి: బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు అనుకూలంగా లేదని.. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని సీపీఎం నాయకులు సోమవారం విమర్శించారు. పేదలకు అందించే 10 కేజీల బియ్యాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒక వైపు ఆర్థిక సంక్షోభం మొదలవుతుంటే చిన్న వ్యాపారులకు కత్తిమీద సాములా ఉందన్నారు. పెద్ద వాహనాలకు ధరలు తగ్గించి చిన్న వాహనదారులైన ఆటో, కార్ల టైర్ల ధరలను పెంచి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆటో నాయకుడు మహేష్ విమర్శించారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనలో రూ.9లక్షల కోట్లు అప్పు చేశారని ఈ భారమంతా ప్రజలపై వేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.కృష్ణనాయక్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, సదా మహేష్, సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు సుదర్శన్, వెంకటేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు అరుదైన గౌరవం



డీసీపీ సందీప్, సీఐ రమణారెడ్డికి ఎక్సలెన్సీ సర్టిఫికెట్ అందజేస్తున్న డీజీపీ అంజనీకుమార్

దుండిగల్: దుండిగల్ పోలీస్‌స్టేషన్ అరుదైన గౌరవం లభించింది. తెలంగాణ వ్యాప్తంగా మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ (ఎంహెచ్‌ఏ) నిర్వహించిన సర్వేలో దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు 2022 సంవత్సరానికి గాను ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికయ్యింది. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులు చేసేందుకు వచ్చే వారిని రిసీవ్ చేసుకోవడం... కేసుల నమోదు, దర్యాప్తు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకుని ఎంహెచ్‌ఏ దేశ వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లకు ర్యాకింగ్ జారీ చేస్తూ వస్తోంది. సోమవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీజీపీ అంజనీకుమార్ చేతుల మీదుగా ఎక్సలెన్సీ సర్టిఫికెట్‌ను మేడ్చల్ డీసీపీ సందీప్, దుండిగల్ సీఐ రమణారెడ్డి అందుకున్నారు.

- ఈ సందర్భంగా అంజనికుమార్ మాట్లాడుతూ... ఎంహెచ్‌ఏ సర్టిఫికేట్ పొందడం అసాధారణమైన విషయమన్నారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మిగతా పోలీస్‌స్టేషన్లకు ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు ఎక్సలెన్సీ సర్టిఫికెట్ రావడం పట్ల సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ డీసీపీ, ఏసీపీ, దుండిగల్ సీఐ, పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ అవార్డు మొత్తం పోలీస్ సిబ్బంది సేవల కాంట్రిబ్యూషన్‌తోనే సాధ్యపడిందని సీపీ పేర్కొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

మోతీనగర్: పర్వత్‌నగర్, జేపీ నగర్‌లోని డ్రైనేజీ పనులను అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. డ్రైనేజీ పనులు ఎంత వరకు పూర్తయ్యాయో సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. బస్తీవాసుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా త్వరగా పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఈ డ్రైనేజీ నిర్మాణ పనులను బస్తీవాసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబా, శ్రీనివాస్‌రెడ్డి, రోణంకి జగన్, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, శ్రీనివాస్ యాదవ్, టి. శ్రీనివాస్, కొండయ్య, రాము యాదవ్, రవీందర్‌రెడ్డి, రాజయ్య, యోగిరాజు, ఆదిరెడ్డి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



పర్వత్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం